





నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM


## ఇంగ్లండ్‌పై అశ్విన్ మరో ఘనత.. తొలి ఆసియా క్రికెటర్‌గా రికార్డు




భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో ఘనత సాధించాడు. ఈ మధ్యే 500 వికెట్ల క్లబ్‌లో చేరిన ఈ ఆఫ్ స్పిన్నర్ ఇంగ్లండ్‌పై 100 వికెట్లు తీశాడు. దాంతో, ఈ ఫీట్ సాధించిన తొలి భారత బౌలర్‌గా అశ్విన్ చరిత్ర సృష్టించాడు. రాంచీలో జరుగుతున్న నాలుగో టెస్టులో అశ్విన్ దంచికొడుతున్న జానీ బెయిర్‌స్టో(38)ను ఎల్బీగా ఔట్ చేశాడు. కీలక సమయంలో అతడని వెనక్కి పంపి 100వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. అంతేకాదు ఇంగ్లీష్ జట్టుపై వంద వికెట్లతో పాటు 1000 పరుగులు బాదిన తొలి ఆసియా క్రికెటర్‌గా అశ్విన్ మరో రికార్డు నెలకొల్పాడు.




## అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా మోదీ

ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో ఘనత సాధించారు. అమెరికాకు చెందిన 'మార్నింగ్ కన్సల్ట్' అనే ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ ఏడాది జనవరి 30 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ దాకా ఈ సర్వే నిర్వహించారు. దేశాధినేతలకు వారి సొంత దేశాల్లో ప్రజాదరణ ఏ స్థాయిలో ఉందో గుర్తించారు. మార్నింగ్ కన్సల్ట్' వెబ్‌సైట్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. నరేంద్ర మోదీకి సొంత దేశం భారత్‌లో 78 శాతం జనాదరణ ఉన్నట్లు తేలింది. అంటే దేశ జనాభాలో 78 శాతం మంది మోదీని నాయకత్వాన్ని ఆమోదిస్తున్నట్లు తేలింది. మోస్ట్ పాపులర్ గ్లోబల్ లీడర్‌గా ఆయన తొలి స్థానం దక్కించుకున్నారు. మరో విశేషం ఏమిటంటే.. గత ఏడాది డిసెంబర్ నిర్వహించిన ఇదే సర్వేలో నరేంద్ర మోదీకి 76 శాతం ప్రజాదరణ లభించింది. అంటే నెల రోజుల్లో మరో 2 శాతం పెరిగినట్లు స్పష్టమవుతోంది. ఈ జాబితాలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ తదితరులు మోదీ కంటే వెనుకబడి ఉన్నారు. మెక్సికో అధ్యక్షుడు అండ్రూస్ మాన్యుల్ లోపెజ్ ఒబ్రాడర్ రెండవ స్థానంలో నిలిచారు.



## బిగ్‌బాస్ ఫేమ్ షణ్ముఖ్‌కు బెయిల్

బిగ్‌బాస్ ఫేమ్, ప్రముఖ యూట్యూబర్ షణ్ముఖ్ జశ్వంత్ బెయిల్‌పై రిలీజ్ అయ్యారు. గంజాయి కేసులో ఇరుక్కున్న షణ్ముక్‌ను లాయర్ కళ్యాణ్ దిలీప్ సుంకర విడిపించారు. ఓ యువతి ఇచ్చిన కంప్లైట్‌తో షణ్ముఖ్ అన్న సంపత్‌ను అరెస్ట్ చేసేందుకు వెళ్లిన పోలీసులకు షణ్ముఖ్ గంజాయి తాగుతూ కనిపించాడు. దీంతో అతని అన్నతో పాటు షణ్ముఖ్ ని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.




## ఒకే ఓవర్లో రెండు వికెట్లు.. రాంచీలో నిప్పులు చెరుగుతున్న ఆకాశ్

రంజీ పేసర్ ఆకాశ్ దీప్ టీమిండియా తరఫున అరంగేట్రంలోనే అదరగొట్టాడు. రాంచీ టెస్టులో డెబ్యూ క్యాప్ అందుకున్న అతడు నిప్పులు చెరుగుతున్నాడు. బుమ్రా లేని లోటును భర్తీ చేస్తూ ఈ పేసర్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టాడు. ఓపెనర్ బెన్ డకెట్(11), ఓలీ పోప్(0)లను వెనక్కి పంపి ఇంగ్లండ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. 10వ ఓవర్ రెండో బంతికి డకెట్ వికెట్ కీపర్ జురెల్ చేతికి చిక్కాడు. ఆకాశ్ నాలుగో బంతికి ఓలీ పోప్‌ను ఎల్బీగా ఔట్ చేశాడు. అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రోహిత్ సేన రివ్యూ తీసుకుని ఆ తర్వాత వచ్చిన జో రూట్(2 నాటౌట్) కూడా ఎల్బీ అప్పీల్ చేశారు. కానీ, డీఆర్ఎస్‌లో ఔట్‌సైడ్ వవెళ్తున్నట్టు కనిపించింది. దాంతో భారత జట్టు రివ్యూ కోల్పోయింది. ఆ మరుసటి ఓవర్లోనే ఆకాశ్ డేంజరస్ జాక్ క్రాలే(42)ను బౌల్డ్ చేశాడు. దాంతో, ఇంగ్లండ్ జట్టు 57 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం జో రూట్ (2 నాటౌట్), జానీ బెయిర్‌స్టో క్రీజులో ఉన్నారు.లంచ్‌కు ముందు ఓవర్లో కెప్టెన్ బెన్ స్టోక్స్(3)ను జడేజా ఎల్బీగా వెనక్కి పంపాడు. దాంతో 112 పరుగుల వద్ద ఇంగ్లండ్ ఐదో వికెట్ పడింది. మాజీ కెప్టెన్ జో రూట్ (16 నాటౌట్) క్రీజులో ఉన్నాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ఇంగ్లండ్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చిన ఆకాశ్ తొలి ఓవర్ నుంచే ఇంగ్లండ్ ఓపెనర్లను వణికించాడు.

# రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే
# లాస్య నందిత మృతి



తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(33) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం వేకువ ఝామున పటాన్‌చెరు ఓఆర్ఆర్ వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో లాస్య నందిత అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడిపిన ఆమె పీఏ ఆకాష్‌కు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

**నిద్రమత్తులోనే?**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ వద్ద ఈ తెల్లవారు ఝామున దుర్ఘటన చోటు చేసుకుంది. సదాశివపేటలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా.. వాహనం ప్రమాదానికి గురైందని తెలుస్తోంది. డ్రైవర్ సీట్‌లో ఉన్న వ్యక్తి నిద్రమత్తు, వాహన అతివేగం ప్రమాదానికి కారణాలైన ఉంటాయని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి.. రెయిలింగ్‌ను బలంగా ఢీ కొట్టడంతోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఆ సమయంలో లాస్య సీటు బెల్ట్ పెట్టుకోక పోవడం వల్ల అక్కడికక్కడే మృతి చెందారు.

**తల్లడిల్లిన తల్లి గుండె**

ఈ ప్రమాదంలో కారు ముందు భాగం బాగా దెబ్బతింది. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న లాస్య నందిత స్పాట్‌లోనే మృతి చెందారు. తీవ్రగాయాలైన ఆకాశ్‌ను మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లాస్య నందిత మృతదేహాన్ని పటాన్‌చెరు అమెధా ఆస్పత్రికి తరలించారు. కూతురి మరణవార్త విని తల్లి స్పృహ తప్పి పడిపోయారు. మృతదేహాన్ని చూసి గుండెలు పగిలేలా రోదించారు. సోదరి నివేదితా రోదన పలువురిని కంటతడి పెట్టించింది. బీఆర్ఎస్ సీనియర్ హరీష్‌రావు ఆస్పత్రికి వెళ్లి లాస్య కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. గాంధీ ఆస్పత్రిలో లాస్య మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించనున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం అందజేస్తారు. ఇక.. యువ ఎమ్మెల్యే మృతి పట్ల బీఆర్ఎస్ వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

**సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..**

లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నందిత తండ్రి సాయన్నతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు సైతం లాస్య మృతిపై సంతాపం ప్రకటించారు. స్వ నందిత మృతిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అతి పిన్న వయసులో ఎమ్మెల్యేగా ప్రజామన్ననలు పొందారని.. రోడ్డు ప్రమాదంలో అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారాయన. బీఆర్ఎస్ నేతలు తలసాని, హరీష్‌రావు, కేటీఆర్, మల్లారెడ్డి.. తదితరులు లాస్య మృతిపై విచారం వ్యక్తం చేశారు.

**ఫస్ట్ టైం ఎమ్మెల్యే..**

లాస్య నందిత కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే సాయన్న కుమార్తె. గతేడాది ఫిబ్రవరిలో సాయన్న గుండె పోటుతో మృతి చెందారు. దీంతో ఆ స్థానంలో లాస్య నందితకు బీఆర్ఎస్ అధిష్టానం టికెట్ ఇచ్చింది. నవంబర్ చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 17,169 ఓట్ల మెజారిటీతో ఆమె విజయం సాధించారు. రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉందని భావిస్తున్న తరుణంలో.. అదీ చిన్న వయసులో లాస్య ఇలా దుర్మరణం చెందడం పట్ల పలువురు నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

**10 రోజుల కిందటే ప్రమాదం..**

ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక లాస్య నందిత వరుసగా ప్రమాదాలకు గురయ్యారు. ఫిబ్రవరి 13వ తేదీన నల్లగొండలో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ జరిగింది. ఎమ్మెల్యే లాస్య నందిత కూడా ఈ సభకు వెళ్లారు. ఆ సమయంలో ఆమె ప్రయాణిస్తున్న కారును నార్కట్‌పల్లి వద్ద ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఆమె వెళ్తున్న కారు ముందు టైర్ ఊడి పోయింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య తలకు స్వల్ప గాయమైంది కూడా. అయితే ఆ సమయంలోనూ ఆకాషే కారు నడిపినట్లు తెలుస్తోంది. అంతకు ముందు.. కిందటి ఏడాది డిసెంబర్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లిన ఆమె మూడు గంటలపాటు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. సిబ్బంది అతికష్టం మీద లిఫ్ట్‌ను బద్ధలు కొట్టి ఆమెను, ఆమెతో పాటు ఉన్న వాళ్లను బయటకు తీశారు. తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదికే.. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మృతి చెందడం గమనార్హం.

**కుటుంబ నేపథ్యం..**

సాయన్న, గీతలకు లాస్య నందిత జన్మించారు. ఆమెకు ఇద్దరు సోదరీమణులు.. నమ్రతా, నివేదితా. లాస్య కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ చేశారు. లాస్య నందిత గతంలో కవాడిగూడ కార్పొరేటర్‌గానూ పని చేశారు. తండ్రి మరణంతో ఆమెకు బీఆర్ఎస్ సీటు ఇవ్వగా.. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎన్ గణేష్‌పై 17 వేల ఓట్లకు పైగా ఆధిక్యంతో లాస్య గెలుపొందారు. ఏడాదికే.. ప్రజాప్రతినిధుల హోదాలోనే ఈ తండ్రీకూతుళ్లిద్దరూ మృతి చెందడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.



## లాస్య నందిత మృతిపై పోలీసులు దర్యాప్తు..
## కారు బ్యానెట్‌పై సిమెంట్ రెడీమిక్స్ ఆనవాళ్లు!

ప్రమాదం తరువాత వంద స్పీడ్ వద్ద స్పీడో మీటర్ ఆగిపోయిందని చెప్పారు. కారు బ్యానెట్‌పై రెడీమిక్స్ సిమెంట్ ఆనవాళ్లు ఉండటంతో.. రెడీమిక్స్ వాహనాన్ని ఢీకొట్టి అదుపుతప్పి ఓఆర్ఆర్ రెయిలింగ్‌కు బలంగా తాకి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం ధాటికి కారు ముందుభాగం మొత్తం నుజ్జునుజ్జు అయిందని తెలిపారు. కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. కాగా, ప్రమాదం అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. కారు డ్రైవర్‌తోపాటు లాస్య నందితను పటాన్‌చెరూలోని అమేధా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు హుటాహుటిన హాస్పిటల్‌కు వెళ్లారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. నదిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించడంతో.. అంబులెన్స్‌తోపాటు అక్కడికి వెళ్లారు.

## అచ్చిరాని ఫిబ్రవరి
## తండ్రి మరణించిన ఏడాదికే..

తండ్రి మరణించిన ఏడాదికే కూతురు మరణించడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. అనారోగ్యంతో ఎమ్మెల్యేగా ఉన్న జి.సాయన్న మృతి చెందడం ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. సాయన్న మృతితో గత ఏడాది నవంబర్ మాసంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లాస్య నందితను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానం నుండి బరిలోకి దింపింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రజా యుద్ధనౌక గద్దర్ కూతురు వెన్నెల పోటీ చేసింది. వెన్నెలపై లాస్య నందిత విజయం సాధించారు. 2023 ఫిబ్రవరి 19వ తేదీన సాయన్న అనారోగ్యంతో మరణించారు. సాయన్న మృతి చెంది ఏడాది దాటింది. నాలుగు రోజుల క్రితమే సాయన్న మృతి చెందిన ఏడాది దాటింది. తండ్రి మరణించిన ఏడాదికే లాస్య నందిత మృతి చెందారు. ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఫిబ్రవరి మాసంలో ఈ కుటుంబంలో వరుస సంఘటనలు జరగడంతో ఫిబ్రవరి నెల అచ్చిరాలేదని సాయన్న అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



## ఎమ్మెల్యే లాస్య నందిత మృతి.. ప్రముఖుల సంతాపం

తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదిలోపే లాస్య నందిత మృతి చెందడం దురదృష్టకరమని ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఆమె ముందు ఉజ్వల భవిష్యత్తు ఉండగా, విధి మరొకటి తలచిందన్నారు. లాస్య నందిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య మృతి ఎంతో బాధ కలిగించిందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని ఆకాంక్షించారు.

లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్న వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. చిన్న యయసులోనే ఎమ్మెల్యేగా గెలిచిన లాస్య.. మూడు నెలల్లోనే ఇలా అందరికీ దూరం అవుతుందని అనుకోలేదు.

– తలసాని శ్రీనివాస్ యాదవ్

చిన్న వయస్సులోనే కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్నికై మంచి రాజకీయ భవిష్యత్తు ఉండి, తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ అందరి మన్ననలు పొందుతున్న లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరం. సంవత్సరం క్రితం వారి తండ్రి సాయన్న మరణం, ఇప్పుడు కూతురు నందిత అకాల మృత్యువుకు లోనుకావడం విచారకరం. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిజేస్తున్నాను.

– ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

లాస్య నందిత మరణం కంటోన్మెంట్ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు.

– వేముల ప్రశాంత్ రెడ్డి

చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై.. తన తండ్రి, దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతూ అందరి మన్ననలు పొందిన నందిత అకాల మరణం తీవ్ర బాధాకరం. ఏడాది క్రితం సాయన్న మరణం, ఇప్పుడు ఆయన కూతురు మృతి చెందడం విచారకరం

– ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. లాస్య గొప్ప భవిష్యత్ ఉన్న యువ నాయకురాలు. ప్రజల మద్దతుతో ఎన్నికై ఇలా అకాల మరణం చెందడం ఎంతో బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలి.

– మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## అధికారిక లాంఛనాలతో
## లాస్య నందిత అంత్యక్రియలు: మంత్రి కోమటిరెడ్డి

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. లాస్య నందిత మృతి బాధాకరమని మంత్రి చెప్పారు. ప్రమాద సమయంలో ఆమె సీట్ బెల్ట్ పెట్టుకోలేదని పోలీసులు చెప్పారని వెల్లడించారు. లాస్య నందిత మృతదేహానికి గాంధీ దవాఖానలో పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరం కార్ఖానాలోని నివాసానికి ఆమె పార్థివదేహాన్ని తరలించారు. ఈస్ట్ మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో లాస్య నివాసానికి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు.

## ముగిసిన పోస్టుమార్టం.. సాయంత్రం అంత్యక్రియలు

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం చెందారు. శుక్రవారం ఉదయం పటాన్‌చెరూ సమీపంలో ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె అక్కడికక్కడమే మృతి చెందారు. దీంతో ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. శవపరీక్ష పూర్తి చేసిన వైద్యులు.. ఆమె భౌతికఖాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మరికాసేపట్లో కార్ఖానాలోని నివాసానికి లాస్య నందిత పార్థివదేహాన్ని తరలించనున్నారు. సాయంత్రం మారేడుపల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ముఠా గోపాల్, కార్పొరేటర్ విజయా రెడ్డి ప్రస్తుతం గాంధీ దవాఖాన వద్ద ఉన్నారు. అంతిమ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను బీఆర్ఎస్ నేతలు తగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




# నేటి నుంచి డబ్ల్యూపీఎల్

## బరిలో 5 జట్లు, 22 మ్యాచ్‌లు
## తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ 'ఢీ'
## మార్చి 17న ఫైనల్ పోరు

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూ పీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గత ఏడాది తొలి సీజన్‌లో అభిమానులను ఆకట్టుకొని పలువురు యువ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చిన ఈ లీగ్ మరోసారి అదే స్థాయిలో ఆసక్తి కరంగా సాగే అవకాశం ఉంది. నేడు చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్ లో గత సీజన్ విజేత ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. మిగతా మూడు జట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గత ఏడాదిలాగే ఈసారి కూడా టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 17న ఢిల్లీ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

**తాజా సీజన్ విశేషాలు....**

♦ గత సీజన్‌లో ఒక్క ముంబైలోనే అన్ని మ్యాచ్ లు జరిగాయి. ఈసారి బెంగళూరు, ఢిల్లీలను వేదికలుగా ఎంపిక చేశారు.

♦ తొలి సీజన్‌లాగే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో తలపడతాయి.

♦ గత ఏడాది ఐదు టీమ్‌లకు కెప్టెన్లుగా వ్యవహరించిన వారే ఈసారి సార థులుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన మెగ్ లానింగ్ (ఢిల్లీ), అలిసా హీలీ (యూపీ), బెత్ మూనీ (గుజరాత్) ఆస్ట్రేలియన్లే కాగా...హర్మన్‌ప్రీత్ (ముంబై), స్మృతి మంధాన (బెంగళూరు) భారత స్టార్లు. భారత్ మినహా ఆసీస్ నుంచే గరిష్టంగా 13 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు.

♦ 2023 సీజన్‌లో సత్తా చాటిన సైకా ఇషాక్, శ్రేయాంక పాటిల్ ఆ తర్వాత భారత జట్టుకు ఎంపికయ్యారు. గత ఏడాది వీరిని కనీస ధర రూ.10 లక్షలకు తీసుకోగా... రెండు సీజన్ల మధ్య భారత జట్టుకు ఆడటంతో బీసీసీఐ నిబంధనల ప్రకారం వీరి ద్దరికి రూ. 30 లక్షల చొప్పన లభిస్తాయి.

♦ ఈ సీజన్ వేలంలో కాశ్వీ గౌతమ్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకుంది. అయితే గాయం కారణంగా ఆమె ఈ సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకోవడం గమనార్హం.

♦ హైదరాబాద్, ఆంధ్ర జట్ల నుంచి 8 మంది ఈసారి డబ్ల్యూ పీఎల్‌లో బరిలోకి దిగ నున్నారు. హైదరాబాద్ ప్లేయర్లు అరుంధతి రెడ్డి (ఢిల్లీ), త్రిష పూజిత (గుజరాత్), యషశ్రీ, గౌహర్ సుల్తానా (యూపీ) జట్లకు... ఆంధ్ర క్రికెటర్లు స్నేహ దీప్తి (ఢిల్లీ), సబ్బినేని మేఘన (బెంగళూరు), షబ్నమ్ (గుజరాత్), అంజలి శర్వాణి (యూపీ) టీమ్‌ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.



# కాంగ్రెస్ చీఫ్ ఖర్గేకు జెడ్ ప్లస్ భద్రత

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు జెడ్-ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నట్లు గురువారం కేంద్ర హోం శాఖ ఆదేశాలిచ్చింది. ఆయన భద్రతకు ఉన్న ముప్పును పరిగ ణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఒక అధికారి వివరించారు. దేశంలో ఆయన ఎక్కడికెళ్లినా సీఆర్‌పీఎఫ్ జవాన్లు వెన్నంటి ఉంటారు. రానున్న ఎన్నికల వేళ ప్రధాన ప్రతిపక్ష పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఖర్గే దేశవ్యాప్తంగా పర్యటించాల్సి ఉంటుంది. అందుకే ఆయనకు భద్రతను పెంచినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇకపై ఆయనకు 24 గంటలపాటూ మూడు షిఫ్టుల్లో 30 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు రక్షణ కల్పిస్తారు. దీంతోపాటు, బుల్లెట్ ప్రూఫ్ వాహనం, పైలట్, ఎస్కార్టు సమకూ రుస్తారు. ప్రధాని మోదీకి అత్యంత కట్టుదిట్టమైన స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ భద్రత ఉంది. దేశంలో అధిక ముప్పు ఉన్న వారికి అందించేదే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత. ఆ తర్వాత ఎక్స్, వై కేటగిరీలుంటాయి.




# బెంగాల్‌లో పీడీఎస్ స్కామ్..
# ఆరు చోట్ల ఈడీ సోదాలు

ప్రజా పంపిణీ వ్యవస్థలో జరిగిన అక్రమాలకు చెందిన కేసులో ఇవాళ బెంగాల్‌లో ఈడీ అధికారులు ఆరు చోట్ల తనిఖీలు చేస్తున్నారు. టీఎంసీ నేత షేక్ షాహజహాన్ తో లింకున్న ఈ కేసులో ఇప్పటికే ఈడీ పలుమార్లు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 29వ తేదీన విచారణకు హాజరుకావాలని గురువారమే టీఎంసీ నేతకు ఈడీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. టీఎంసీ నేత షాహజహాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. బెంగాల్‌లో జరిగిన పీడీఎస్ స్కామ్‌లో అతను ప్రధాన నిందితుడిగా ఉన్నారు. గత వారం సుమారు 120 మంది కేంద్ర బలగాలతో షాహజహాన్ ఇంటికి ఈడీ అధికారులు వెళ్లారు. ఆయన లేకపోవడంతో ఆ ఇంటికి తాళం వేశారు. సందేశ్‌ఖాలీలో మహిళలను లైంగికంగా వేధించినట్లు ఆయనపై ఆరోపణలు కూడా ఉన్నాయి.

# సుందరం మాస్టర్ మూవీ రివ్యూ

ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో కమెడియన్స్ అందరూ హీరోలుగా మారుతూ వాళ్ల అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మొన్నటికి మొన్న సత్యం రాజేష్ పొలిమేర సినిమాతో హీరోగా మారి మంచి సక్సెస్ ని సాధించాడు. ఇకదానితో పొలిమేర 2 సినిమా కూడా తీసి విమర్శకుల నుంచి ప్రశంశలను అందు కున్నాడు. ఇక ఇప్పుడు వైవా హర్ష కూడా సినిమా హీరోగా మారి 'సుందరం మాస్టారు' అనే సినిమా తీశాడు. యూట్యూబ్ లో షార్ట్ ఫిలిమ్స్ నుంచి మొదలైన ఆయన ప్రస్థానం చాలా సినిమాల్లో కమెడియన్ గా, హీరో ఫ్రెండ్ గా పాత్రలను పోషిస్తూ ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కుతూ వచ్చాడు. ఇక ఇప్పుడు ఆయన హీరోగా చేసిన 'సుందరం మాస్టారు' సినిమా ఈరోజు రిలీజ్ అయింది. మరి ఈ సినిమాతో హీరోగా చేసిన ఆయన తన మొదటి ప్రయత్నంలో సక్సెస్ అయ్యాడా లేదా అనే విషయాన్ని మనం ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం...




కథ

ముందుగా ఈ కథ విషయానికి వస్తే సుందరం మాస్టారు అనే ఒక వ్యక్తి గవర్నమెంట్ స్కూల్లో సోషల్ టీచర్ గా పని చేస్తాడు. ఆయనకి డబ్బులుంటే చాలా ఇష్టం ఉంటుంది. గవర్నమెంట్ టీచర్ అయ్యాడు కాబట్టి ఇప్పుడు తను పెళ్లి చేసుకుంటే తనకి ఎక్కువ కట్నం వస్తుందని ఆశపడతాడు. ఇక ఇదే టైం లో ఆ ఏరియాలో ఉన్న లోకల్ ఎమ్మెల్యే ఒకరోజు స్కూల్ కి వచ్చి అక్కడున్న టీచర్లందరినీ పరీ క్షిస్తాడు. అందులో సుందరం మాస్టారు టాలెంట్ ని గుర్తించిన ఆయన తనకి ఒక పనిని అప్పజెప్తాడు. అది ఏంటి అంటే మిరియాల మెట్ట అనే ఒక ఊరు ఉంది. అది దాదాపు 90 సంవత్సరాలు నుంచి ప్రపంచంతో సంబంధం లేకుండా అక్కడ మనుషులు బతు కుతున్నారు. ఇప్పటివరకు వాళ్ళు ఎవ్వరిని ఏ హెల్ప్ అడగలేదు మొదటిసారిగా ఎమ్మెల్యే అయిన నన్ను వాళ్ళకి ఇంగ్లీష్ నేర్పించడానికి ఒక మాస్టర్ కావాలని ఉత్తరం రాశారు. ఇప్పుడు నువ్వు వెళ్లి వాళ్లకు ఇంగ్లీష్ మాస్టర్ గా పనిచేయాలి అని చెప్తాడు. ఇక వాళ్ళు అన్ని సంవత్సరాల నుంచి అక్కడే నివసిస్తున్నారు అంటే అక్కడ విలువైనది ఏదో ఉంది, అదేంటో తెలుసుకొని ఆరు నెలల్లో గనక నువ్వు తిరిగి వస్తే నీకు DEO గా పోస్ట్ ఇప్పిస్తాను అని చెప్పడంతో సుందరం మాస్టర్ టెంప్ట్ అవుతాడు. గవర్నమెంట్ టీచర్ కంటే DEO పెద్ద పోస్ట్ కాబట్టి DEO అయిన తర్వాత పెళ్లి చేసుకుంటే కట్నం ఎక్కువగా వస్తుంది అని ఆశపడి మిరియాల మెట్ట ఊరికి బయలు దేరుతాడు.

ఇక అక్కడ ఉన్న జనాలు ఇంగ్లీష్ మాట్లాడడం చూసి సుందరం మాస్టర్ ఆశ్చర్యపోతాడు. సుందరం మాస్టారు మాట్లాడే ఇంగ్లీష్ సరైన ఇంగ్లీష్ కాదని వాళ్లు గొడవకు దిగుతారు... ఇక వాళ్ళు సుందరం మాస్టారు తో నీకు ఇంగ్లీష్ రాదని మకు తెలుసు నీకు ఒక 15 రోజులు టైం ఇస్తున్నాం. నువ్వు ఇంగ్లీష్ మొత్తం నేర్చుకోవాలి అప్పుడు నీకు ఒక ఎగ్జామ్ పెడతాం. అందులో నువ్వు పాస్ అయితే ఇంగ్లీష్ మాస్టర్ గా ఇక్కడ పనిచేస్తావు. లేకపోతే నిన్ను ఉరివేసి చంపేస్తాం అని ఆ ఊరి పెద్ద చెబుతాడు. దాంతో సుందరం మాస్టర్ అనవసరంగా ఇక్కడ ఇరు క్కుపోయానే అని భాద పడుతూ ఉంటాడు. అయితే అక్కడ ఉన్న ఓజా అనే వ్యక్తి సుందరం మాస్టర్ కి హెల్ప్ చేస్తూ ఉంటాడు. ఇక వాళ్ల ఊరు చరిత్ర గురించి చెబుతూ 1920 వ సంవత్సరంలో బ్రిటీష్ వాళ్ళు మా దగ్గరికి వచ్చి మా మిరియాల కోసం మమ్మల్ని బానిసలుగా చేసుకున్నారు. ఇక అప్పుడే ఒక దొర వచ్చి ఆ బ్రిటిష్ వాళ్ళని పంపించి ఆయన ఇక్కడే సెటిలై మాకు ఇంగ్లీషు నేర్పించాడు. అతని కొడుకు మాకు కొన్ని ఇంగ్లీష్ పదాలను నేర్పించడంతో మేము మాట్లాడడం కూడా నేర్చుకున్నాం. కాకపోతే ఆయన చనిపోవడంతో మాకు ఇంగ్లీష్ మాస్టర్ కావాల్సి వచ్చింది. దానికోసమే మేము ఇంగ్లీష్ మాస్టర్ కావాలని ఉత్తరం రాసాము అని చెబుతాడు. ఇక ఈ ఊరు గురించి మొత్తం తెలుసుకున్న సుందరం మాస్టారు ఓజా సహాయంతో వాళ్ళు పెట్టిన ఎగ్జామ్ పాస్ అవుతాడు. ఇక వాళ్లకు ఇంగ్లీష్ మాస్టర్ గా సెట్ అవుతాడు. ఇక ఇది ఇలా ఉంటే ఇక్కడ ఏదో విలువైనది ఉంది అని మాస్టారు దాన్ని వెతుకుతుంటే అతనికి గ్రామదేవత విగ్రహమే ఇక్కడ అత్యంత విలువైనదని తెలుస్తుంది. దాంతో ఆ గ్రామ దేవత విగ్రహం దగ్గరికి వెళ్లి చూస్తే అక్కడ విగ్రహం ఉండదు. అసలు విగ్రహానికి ఏమైంది? సుందర మాస్టర్ వాళ్లకి ఇంగ్లీష్ పూర్తిగా నేర్పించాడా? అక్కడ నుంచి సుందర మాస్టర్ ఎలా బయటపడ్డాడు అనే విషయాలు తెలియాలంటే మీరు ఈ సినిమా చూడాల్సిందే...

విశ్లేషణ


ఇక ఈ సినిమా విశ్లేషణ విషయానికొస్తే సినిమా దర్శకుడు అయిన కళ్యాణ్ సంతోష్ మొదటి నుంచి చివరి వరకు ఈసినిమాను చాలా ఎంగేజింగ్ గా తీసుకెళ్లాడు. ముఖ్యంగా ఆయన రాసుకున్న కొన్ని సీన్లు అయితే నవ్వులు పూయించాయనే చెప్పాలి. మిరియాల మెట్ట అనే ప్రాంతంలో నివసిస్తున్న వాళ్ళు, ప్రపంచం ఎలా ఉంది అనే విషయాన్ని కూడా తెలి యకుండా బతుకుతూ ఉంటారు. నిజానికి వాళ్లకి కరెన్సీ నోటు ఎలా ఉంటుందో కూడా తెలియదు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్న విషయం కూడా తెలియదు, మన జాతిపిత గాంధీజీ అనే విషయాలేవీ వాళ్లకి తెలి యకుండా బతుకుతూ ఉంటారు. ఇక వాటి గురించి సుందర మాస్టర్ చెప్పే సమయంలో వచ్చే కామెడీ అయితే చాలా బాగుంటుంది. ఈ స్టోరీలో లాజిక్కులను పక్కన పెడితే సినిమా అనేది ఆధ్యాంతం ఒక హిలేరియస్ మూడ్ లో వెళ్తుంది. ఇలాంటి సినిమాలను చేయాలంటే కొంచెం కష్టంతో కూడుకున్న పనే ఎందుకంటే దాదాపు రెండున్నర గంటలపాటు ప్రేక్షకుడిని కూర్చోబెట్టి ఎంటర్ టైన్ చేయడం అంటే మామూలు విషయం కాదు, కానీ ఈ విషయంలో డైరెక్టర్ కళ్యాణ్ చాలా వరకు సక్సెస్ అయ్యాడనే చెప్పాలి. ఇక వైవా హర్ష మిరియాల మెట్ట ఊర్లోకి ఎంటర్ అయిన తర్వాత నుంచి సినిమా నాన్ స్టాప్ గా ఎక్కడ బోర్ కొట్టకుండా నడుస్తూ ఉంటుంది. విగ్రహం గురించి ఒక చిన్న హై మూమెంట్ ఇచ్చి ఇంటర్వెల్ వేస్తాడు. ఇక సెకండ్ హాఫ్ అంత ఇంట్రెస్టింగా సాగుతూ ఉంటుంది. అలాగే సుందరం మాస్టారుకి డబ్బు ఒకటే ప్రపంచం కాదు. ఇక్కడ ఉండే ప్రకృతి గాని, ఇక్కడ ఉండే మనుషుల మధ్య కల్మషం లేని మనస్తత్వాలు గానీ ఎలా ఉంటాయి వాటిలో ఎంత స్వచ్ఛత ఉంటుంది అనే విషయాలను తెలియజేస్తూ సాగే ఎమోషనల్ టచ్ తో కూడిన సీన్లను కూడా చాలా బాగా ఎలివేట్ చేస్తూ డైరెక్టర్ రాసుకున్నాడు. అన్ని బాగానే ఉన్నప్పటికీ ఈ సినిమాలో కొన్ని సీన్లను వదిలేస్తే సినిమా మొత్తానికి ఒక మూడు క్రియేట్ చేయడంలో మాత్రం దర్శకుడు కొద్దిగా తడ పడ్డాడు. ఆయనకు మొదటి సినిమా కాబట్టి ఆయన తడపడ్డట్టుగా చాలా స్పష్టంగా అర్థ మైపోతూ ఉంటుంది. అలాగే డైరెక్షన్ లో కూడా చాలా వరకు ఫ్లాస్ ఉన్నాయి...ఇక ఆయన రాసుకున్న స్క్రీన్ ప్లే కూడా ప్రేక్షకుల్లో అంత ఇంపాక్ట్ క్రియేట్ చేయలేదు...

నటీనటుల పనితీరు...

ఇక ఆర్టిస్టులు పర్ఫామెన్స్ విషయానికొస్తే వైవా హర్ష ఒక్కడే వన్ మ్యాన్ షో చేస్తూ ఈ సినిమాని ముందుకు తీసుకెళ్లాడు. దర్శకుడు ఏ పాయింట్ అఫ్ వ్యూలో అయితే ఈ సినిమా కథని రాసుకున్నాడో అందులో కొంచెం కూడా డివియేట్ అవ్వకుండా సుందరం మాస్టర్ అనే క్యారెక్టర్ ని హర్ష పర్ఫెక్ట్ గా పొట్రే చేశాడనే చెప్పాలి. ఇక హీరోయిన్ అయిన దివ్య శ్రీపాద తన పాత్ర మేరకు పర్లేదు అనిపించింది. ఇక మిగతా సపోర్టింగ్ ఆర్టిస్టులందరూ కూడా ఓకే అనేలా చేశారు. కానీ మొత్తానికైతే వైవా హర్ష మాత్రం సుందరం మాస్టారు పాత్రలో నటించి మెప్పించడం అనేది నిజంగా గ్రేట్ అనే చెప్పాలి. ఇక ఇప్పటివరకు కనిపించిన హర్ష వేరు, ఈ సినిమాలో హర్ష వేరు. కొన్ని ఎమోషన్స్ సీన్స్ లో అయితే నెక్స్ట్ లెవల్ పర్ఫామెన్స్ ఇచ్చాడనే చెప్పాలి...

టెక్నికల్ అంశాలు

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే ఈ సినిమాకి దీపక్ అందించిన విజువల్స్ సూపర్ గా ఉన్నాయి. కొన్ని సీన్లలో ఎమోషన్ ని పండిం చడానికి ఆయన ఎంచుకున్న షాట్స్ అయితే చాలా అద్భుతంగా ఉన్నాయి. సీన్ మూడ్ ని చెడగొట్టకుండా అలాగే సినిమా చూసే ప్రేక్ష కుడికి కొత్తగా అనిపించే విధంగా తను అందించిన విజువల్స్ సూపర్ గా ఉన్నాయి... ఇక శ్రీ చరణ్ మ్యూజిక్ బావుంది. కానీ సినిమాని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్లడంలో మాత్రం తన మ్యూజిక్ పూర్తి స్థాయిలో హెల్ప్ అవ్వలేదనే చెప్పాలి. ఇక మనం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఆర్ట్ డైరెక్టర్ చంద్రమౌళి గురించి మిరియాల మెట్ట అనే ఊరుని ఆయన సెట్స్ తో అద్భుతంగా డిజైన్ చేశాడు. ఈ సినిమా బాగా రావడానికి తన వంతు బాధ్యతని తను హండ్రెడ్ పర్సెంట్ పూర్తి ఎఫర్ట్ పెట్టి చేశాడనే చెప్పాలి...ఇక ప్రొడక్షన్ వాల్యూస్ విషయానికి వస్తే ఉన్నదాంట్లో బాగున్నాయి. రవితేజ మొదటి ప్రయత్నం లోనే ప్రేక్షకులకు ఒక మంచి సినిమాను అందించాడు.






# తెలంగాణవారికి గుడ్‌న్యూస్.. త్వరలోనే మరో 2 గ్యారంటీలు అమలు..


తెలంగాణ వాసులకు గుడ్‌న్యూస్. త్వరలోనే మరో రెండు గ్యారంటీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ పథకాలను ఆచరణలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 27న లేదా 29వ తేదీన ఈ గ్యారంటీలను గవర్నమెంట్ ప్రారంభించనుంది. ఈ మేరకు గ్యారంటీల అమలుకు సంబంధించిన విధి విధానాలపై కేబినెట్ సబ్ కమిటీతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. గృహజ్యోతి పథకానికి అర్హులైన వారి మార్చి మొదటి వారంలో జీరో బిల్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు రూ.500 చెల్లిస్తే సిలిండర్ అందించేలా ప్రణాళిక సిద్ధం సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రజాపా లనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చూడాలని సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. కొత్త దరఖాస్తు చేయాలనుకునేవారు ఎంపీడీవో, తహశీల్దార్ ఆఫీసుల్లో అప్లై చేసుకోవచ్చని సూచించారు.

# ఇజ్రాయెల్ దాడుల్లో 48 మంది మృతి

గాజాలోని దక్షిణ, మధ్య ప్రాంతాలపై బుధవారం రాత్రి ఇజ్రాయెల్ బలగాలు జరిపిన దాడుల్లో కనీసం 48 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక అధికారులు తెలిపారు. మృతుల్లో సగం మంది మహిళలు, చిన్నారులు ఉన్నారు. రఫాలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, సెంట్రల్ గాజాలో 14 మంది చిన్నారులు, 8 మంది మహిళలు సహా మొత్తం 44 మంది ప్రాణాలు కోల్పోయారు. రఫా చుట్టుపక్కల జరిగిన వైమానిక దాడుల్లో అల్ ఫరూక్ మసీదు నేలమట్టం అయింది. మరోవైపు, వెస్ట్‌బ్యాంక్ జాతీయరహదారిపై గురువారం ఉదయం రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో సాయుధులు కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో ఒక ఇజ్రాయెల్ యువకుడు చనిపోగా మరో అయిదుగురు గాయప డ్డారు. ఇజ్రాయెల్ పోలీసుల కాల్పుల్లో ఇద్ద రు దుండగులు చనిపోయారు. మూడో వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ కాల్పులకు కారణమని ఎవరూ ప్రకటించుకోనప్పటికీ హమాస్ సాయుధబలగాలు మాత్రం హర్షం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడులు ఆగి, స్వతంత్ర పాలస్తీనా అవతరించేదాకా ఇటువంటి మరిన్ని దాడులకు దిగాలని పిలుపునిచ్చారు.

# టెలిగ్రామ్‌లో కిడ్నీల దందా..!

తెలంగాణలో మరోసారి కిడ్నీ రాకెట్ కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. క్రయవిక్రయాలకు సంబంధించి సామాజిక మాధ్యమంలో ప్రకటనలపై అందిన ఫిర్యాదు మేరకు తెలంగాణ సీఐడీ సెక్షన్ 18, 19 ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ ట్రాన్స్‌ప్లాంటేషన్-1994 చట్టం కింద కేసు నమోదు చేసింది. టెలిగ్రామ్ యాప్‌లో ఓ ఛానెల్ ద్వారా దందా సాగిస్తున్న అంశంపై సామాజిక కార్యకర్త ఒకరు ఇచ్చిన ఫిర్యాదుతో సీఐడీ బృందం దర్యాప్తు ప్రారంభించింది. కిడ్నీ అవసరమున్న బాధితులను గుర్తించి ఆ గ్రూపులో చేర్చేలా ముఠా కుట్ర పన్నినట్లు వెల్లడైంది. అడ్మిన్ మాత్రమే సభ్యులను చేర్చేలా గుట్టుగా దందా సాగి స్తున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఇది సైబర్ మోసమా లేక నిజంగానే కిడ్నీలు విక్రయిస్తున్నారా..? అని తేల్చే దిశగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటివరకు ఎవరైనా బాధితులు ఈ ముఠా బారినపడ్డారా..? అని ఆరా తీస్తున్నారు. రాష్ట్రంలో గతంలోనూ పలు కిడ్నీ రాకెట్‌లు బహిర్గతమయ్యాయి. సీఐడీతోపాటు హైద



రాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఇవి వెలు గుచూశాయి. శ్రీలంకకు తీసుకెళ్లి కిడ్నీలను మార్పిడి చేయించిన ముఠాలను పోలీసులు గుర్తించారు. 2016నాటి కేసులో సీఐడీ గత ఏడాదే అభియో గపత్రం దాఖలు చేసింది. తాజాగా మరోసారి వెలుగు చూసిన నేపథ్యంలో పాత ముఠాల్లోని నిందితుల గురించి సీఐడీ ఆరా తీస్తోంది.